క్లుప్తంగా

10న వాహనాల వేలం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 10న వేలం పాటు వేస్తున్నట్లు కడప ఎస్‌ఈబీ సీఐ విశ్వనాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప ఎస్‌ఈబీ స్టేషన్ ఆవరణలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు తమ స్టేషన్‌లో సంప్రదించాలని వివరించారు.

కార్పొరేషన్లకు నిధులు కేటాయించండి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ కోరారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్పొరేషన్లు నిధులు లేక ఊసూరుమంటున్నాయని తెలిపారు. ఎంతోమంది స్వయం ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజు, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశాలను ప్రొద్దుటూరు పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో ఫిబ్రవరి 8, 9 తేదీలలో నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు తెలిపారు. ఆదివారం కడప నగరంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహంలో జిల్లా జనరల్ కౌన్సిల్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు మురళీకృష్ణ, తరుణ్, విగ్నేష్, రాజశేఖర్, లోకేష్, విష్ణు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటేరుకు ఎస్‌ఎల్‌టీఏ మద్దతు



ఒంటేరుకు మద్దతు తెలుపుతున్న ఎస్‌ఎల్‌టీఏ నాయకులు

కడప ఎడ్యుకేషన్: పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి ఎల్‌ఎల్‌టీఏ తమ మద్దతును ప్రకటించింది. ఈ సందర్భంగా రాష్ట్ర బాషోపాధ్యాయ సంస్థ(ఎస్‌ఎల్‌టీఏ) అధ్యక్షుడు అంకాల్ కొండయ్య మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరగకుండా ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎల్‌టీఏ నాయకులు బోగా గంగాధర్, పల్లా భాస్కర్, సాయికుమార్, జింకా శేఖర్, రఫీ, ఆపస్ సుబ్బరాయుడు, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు శివార్జునలతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజుకు మద్దతు



ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజును సన్మానిస్తున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్ : పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ స్థానానికి పీడీఎఫ్ నుంచి పోటీ చేస్తున్న పోతుల నాగరాజుకు రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ తరపున సంపూర్ణ మద్దతు ఇస్తామని రూట వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ ప్రకటించారు. ఆదివారం కడపలోని రూట కార్యాలయంలో రూట నాయకులను డాక్టర్ పోతుల నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను వారు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ రాష్ట్ర నాయకులు ఇలియాస్ బాష, సనావుల్లా, రూట రాష్ట్ర నాయకులు షాహిదుల్ల, సత్తార్‌ఫైజీ, హాజీ అబ్దుల్ హకీమ్, సిరాజుద్దీన్, మస్తాన్‌వలి, ప్రకృద్దీన్, సలాం, అయ్యూబ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్‌ఇర్షాద్, జాకీర్ హుస్సేన్, ఆర్థిక కార్యదర్శి జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో డ్రైనేజీ పనులు ప్రారంభం

చెన్నూరు : చెన్నూరు టౌన్ గ్రామ సచివాలయం-2 పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద డ్రైనేజీ పనులను ఆదివారం సర్పంచ్ సిద్దిగారి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఎంపీటీసీ ముదిరెడ్డి సుబ్బారెడ్డి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రూ.5 లక్షలు డ్రైనేజీ పనులకు కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జుమస్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

శ్రీ వాసవాంబకు విశేష వ్రత పూజలు



వాసవీ కన్యకా పరమేశ్వరీదేవికి పుష్పయాగం



ఆలయంలో వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : ఆర్యవైశ్యులకు ఆరాధ్యదైవమైన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారికి ఆదివారం కడప నగరంలోని అమ్మవారిశాలలో విశేష వ్రత పూజలను సమర్పించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీ వాసవీ మాలను ధరించిన భక్తులు వ్రతం ముగింపు దగ్గర పడుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా తొలుత అమ్మవారి మూల మూర్తితోపాటు ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించి కనుల పండువగా సువర్ణ చేలంతో అలంకరించారు. కనుల పండువగా అలంకరించిన వేదికపై కొలువుదీర్చారు. అమ్మవారిని వివిధ రకాల పండ్లతోనూ, వెనుక గల తెరను చెరుకు గడలతోనూ అలంకరించడం విశేషం. మాలధారులైన భక్తులు తమ కుటుంబ సభ్యులతో హాజరై అమ్మవారి సన్నిధిలో వాసవాంబ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కుంకుమార్చన అనంతరం నివేదన చేసి భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం మహిళా విభాగం భక్తులు ప్రత్యేకంగా అమ్మవారికి పుష్పయాగం నిర్వహించారు.

కడప 'బోటు' షికారు బంద్



మూలనపడిన బోటు



మూతపడిన బోటింగ్ యూనిట్

- 20 రోజులుగా మూలనపడ్డ బోట్లు
- అదే దారిలో మరికొన్ని యూనిట్లు

కడప కల్చరల్ : దేవుని (పాత) కడప చెరువులో నిర్వహిస్తున్న బోటు షికారు 20 రోజులుగా బంద్ అయింది. ఇక్కడి యూనిట్ ఆపరేటర్ ఇటీవల కొత్తగా బోటు షికారు ఏర్పాటు చేసిన పార్నపల్లె టూరిజం జలాశయానికి బదిలీ కావడంతో కడప యూనిట్ నిర్వాహకులు లేక మూతపడింది. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ షికారు తీరా సీజన్‌లో మూతపడటం పట్ల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

జిల్లాలో కడప నగరంతోపాటు మైలవరం, ఒంటిమిట్ట, బ్రహ్మంసాగర్‌లలో బోటు షికారు సౌకర్యం ఉండగా, ఇటీవల పార్నపల్లె కూడా చేరింది. ప్రారంభం నుంచి వీటికి మంచి డిమాండ్ ఉండేది. కాలక్రమంలో ఉన్న బోట్లు శిథిలం కాగా, కొత్తవి తేవకపోవడంతో క్రమంగా బోటింగ్ చేయడం తగ్గింది. కడప నగరంలో మూడు పెడల్ బోట్లు, పది సీట్లు ఉన్న ఒక డీలక్స్ బోటు ఉన్నాయి. కానీ దాదాపు అవన్నీ తరుచూ మరమ్మతులకు గురయ్యాయి. ఆపరేటర్ ఉండగా ఎప్పటికప్పుడు చిన్నచిన్న మరమ్మతులు చేయించి ఒకటి, రెండు బోట్లను ఉపయోగించేవారు. ప్రస్తుతం కడప యూనిట్‌లోని అన్ని బోట్లు మూలకు చేరాయి. పరిస్థితి ఇలాగే ఉంటే యూనిట్ పునఃప్రారంభించడం ఆలస్యమైతే మూలనపడ్డ బోట్లు పూర్తిగా శిథిలమై పనికి రాకుండా పోయే ప్రమాదముందని ప్రజలు విమర్శిస్తున్నారు.

కడపలోని బోటింగ్ ఆపరేటర్‌ను వేరే ప్రాంతానికి బదిలీ చేయడంతో ఇక్కడి యూనిట్ మూతపడింది.. నిజానికి కడపతోపాటు ఇటీవల బ్రహ్మంసాగర్ బోటింగ్ యూనిట్ కూడా మూలనపడింది. ఒంటిమిట్టలో కూడా బోటింగ్ జరగడం లేదు. దాన్ని ప్రైవేటుకు అప్పగించినట్లు సమాచారం

తీరా సీజన్‌లో..

కడప నగరంలో దేవునికడప బ్రహ్మోత్సవాలు మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్నాయి. వారం రోజులపాటు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. బోటింగ్ చేసేవారి సంఖ్య కూడా ఎక్కువగా ఉండి మంచి ఆదాయం వస్తుంది. ఆ తర్వాత ఏప్రిల్‌లో ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు, ఆ తర్వాత మే నెలలో బ్రహ్మంగారిమఠంలో ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సీజన్లలో బోటింగ్ కోసం జనం అధిక సంఖ్యలో వస్తారు. ఆయా యూనిట్లు అత్యధిక ఆదాయం కళ్ల చూసేది ఆ రోజుల్లోనే. అలాంటి మంచి సీజన్‌లో బోటు షికారు తిరిగి ప్రారంభిస్తే మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని ప్రజలు సూచిస్తున్నారు. ఒక్కొక్క యూనిట్‌లో నాలుగు పెడల్ బోట్లు, ఒక డీలక్స్ బోటు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

'బ్రౌన్'కు ఎంత చేసినా తక్కువే!



మునగాల సూర్యకళావతిని సత్కరిస్తున్న సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం ప్రతినిధులు

- వైవీయూ మాజీ వీసీ సూర్యకళావతి
- బ్రౌన్‌లో ఘనంగా వీడ్కోలు సభ

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్ గ్రంథాలయంతో తనకు సాహిత్యానుబంధం ఉందని, తన శక్తి కొద్దీ ఈ కేంద్రం అభివృద్ధికి కృషి చేశామని, దీనికి ఎంత చేసినా తక్కువగానే అనిపిస్తోందని యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీగా ఉద్యోగ విరమణ సందర్భంగా ఆచార్య సూర్యకళావతి అన్నారు. ఆదివారం బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆమెకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయం నూతన భవనం పూర్తయి ఉంటే తనకు సంపూర్ణ సంతృప్తి లభించి ఉండేదన్నారు. బ్రౌన్ గ్రంథాలయం పిల్లల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని, వారి సంక్షేమం కోసం పాటుపడాలనే కోరిక ఉండేదని, ఇది కొరతగా మిగిలిపోయిందన్నారు. తొలుత బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి గ్రంథాలయానికి వీసీగా మునగాల సూర్యకళావతి అందించిన సేవలను గుర్తు చేశారు. సీనియర్ రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ పాలకమండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి బ్రౌన్ గ్రంథాలయ నూతన భవనానికి నిధులు మంజూరు చేయించుకోగలిగిన ఆచార్య సూర్యకళావతి భవనం పూర్తయ్యే వరకు ఉండి ఉంటే బాగుండేదన్నారు. వైవీయూ లలిత కళల విభాగం సమన్వయకర్త డాక్టర్ కోటా మృత్యుంజయరావు మాట్లాడుతూ ఆచార్య సూర్యకళావతికి లలిత కళల పట్ల ఎంతో మక్కువని, ఆమె సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ వర్సిటీకి న్యాక్ గుర్తింపు తెచ్చి పెట్టేందుకు ఉపయోగపడటం మరువరాని విషయమన్నారు. కవిత సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి ఆమె సేవలను కొనియాడుతూ భగవద్గీతను కానుకగా ఇవ్వగా డాక్టర్ సురేష్ వర్సిటీ అలుమిని విద్యార్థుల సంఘం పక్షాన మాట్లాడారు. అనంతరం పలు సాహిత్య, సాంస్కృతిక, పర్యాటక సంస్థల ప్రతినిధులు ఆమెను ఘనంగా సత్కరించారు. బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది పక్షాన ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి శ్రీ వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందజేశారు.

పోరాట పటిమ అవసరం

పులివెందుల రూరల్ : జీవితంలో నేటి యువతకు పోరాట పటిమ అవసరమని షార్ట్‌ఫిలిమ్ డైరెక్టర్ గౌస్ అన్నారు. ఆదివారం పార్నపల్లె రోడ్డులోని బీఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో షార్ట్ ఫిలిమ్ ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణకావేశంలో ఆత్మహత్యలు చేసుకోవడం మానాలని, పోరాడి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. యువత, రైతుల్లో స్ఫూర్తిని నింపే విధంగా తన షార్ట్ ఫిలిమ్ ఉంటుందన్నారు.

వివేకానంద శోభాయాత్ర

పోరుమామిళ్ల : స్వామి వివేకానంద వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ముసల్‌రెడ్డిపల్లెలో జనహిత కడప అంచల్ అధ్యక్షుడు తుపాకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. విద్యార్థులు వివేకానంద, భరతమాత వేషధారణలతో శోభా యాత్రలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కడప కల్చరల్ : కడప నగరంలోని సాయిపేట మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం 1994–95 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని మురిసిపోయారు. 'ఏందిరా సామీ పుల్ల మాదిరిగా ఉండేవాడివి.. ఇట్ట తయారైనవ్.. ఏమ్మే మా బ్యాచ్‌ను చూస్తే ఇప్పుడు భయం లేదా? అంటూ అబ్బాయిలు.. ఏం రా సుబ్బారావు ఇప్పుడైనా బుద్ధిగా ఉండావ్ కదా.. పిల్లోళ్లు ఏం చేస్తున్నారు'...అంటూ అమ్మాయిలు ఒకరి నొకరు ఆప్యాయంగా పలుకరించారు. ఒకరి క్షేమాన్ని మరొకరు తెలుసుకున్నారు. తాము చదువుకున్న తరగతుల్లో బెంచీల్లో దర్జాగా కాసేపు కూర్చొన్నారు. నాటి పలు సంఘటనలను గుర్తు చేసుకుని జ్ఞాపకాల్లో జారుకుని హుషారుగా ఆటపాటలతో గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి ప్రధానోపాధ్యాయులు ఓబులయ్య, గురువులు శ్రీరామమూర్తి, సుబ్బయ్యశర్మ, శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డిలను ఘనంగా సత్కరించారు. నాటి విద్యార్థులు రామకృష్ణ, పాలకొండ్రాయుడు, రాజేష్, ప్రసాద్, సందీప్, అనిల్‌కుమార్, సునీత, సౌజన్య, త్రివేణి, వరలక్ష్మి,చంద్ర, బాల సరస్వతి, ప్రసన్న, రాజా, సుభాషిణి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



సాయిపేట మున్సిపల్ హైస్కూలు పూర్వ విద్యార్థులు

'పెద్దల' అనుభవాలు.. బంగారు సోపానాలు



వయో వృద్ధులను సత్కరిస్తున్న స్వామి తురియానంద, రెడ్డి సమితి ప్రతినిధులు

కడప కల్చరల్ : జీవితాన్ని కాచి వడపోసి గడించిన పెద్దల అనుభవాలు భావి తరాలకు బంగారు బాటలుగా ఉపయోగపడగలవని చిన్మయ మిషన్ కడపశాఖ అధ్యక్షులు స్వామి తురియానంద పేర్కొన్నారు. కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 84 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వయోవృద్ధులను ఘనంగా సత్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి 31 మంది వయోవృద్ధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రెడ్డి సేవా సమితి అధ్యక్షులు నాగిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వామి తురియానంద ప్రధాన ప్రసంగం చేశారు. నేటి తరంలో ఎక్కువ మంది పెద్దల ఆస్తిపాస్తులపై చూపుతున్న ఆశ, వారిని అంత గొప్పస్థితిలో నిలిపిన పెద్దలైన వృద్ధుల పట్ల చూపించకపోవడం బాధాకరమన్నారు. ఇలా బాధ్యత లేని తనం దిగజారుతున్న విలువలకు నిదర్శనమన్నారు. పెద్దల కష్టాన్ని అర్థం చేసుకుని నేటి తరం బాధ్యతగా ఉండాలని సూచించారు. కడప జైన సంఘం అధ్యక్షులు చంద్రప్రకాశ్ చెప్రా, విశ్వహిందూ పరిషత్ మాజీ అధ్యక్షులు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, న్యాయవాది రవీంద్రనాథ్‌రెడ్డి, మధుసూదన్ వృద్ధులు తమ కుటుంబాల ద్వారా సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. రెడ్డి సేవా సమితి కార్యవర్గం ఆదినారాయణరెడ్డి, అశోక్ రెడ్డి, రెడ్డికుమారి, పద్మప్రియ చంద్ర ఓబుల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటరెడ్డి, శివనారాయణరెడ్డి, రెడ్డి జన సంఘ్ అధ్యక్షులు మద్దిక సుబ్బిరెడ్డిలు కార్యక్రమంలో పాల్గొన్నారు. రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు పట్టువస్త్రాలు కానుకగా అందజేసి వేద పండితులతో ఆశీర్వచనం చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేశు

కడప సెవెన్‌రోడ్స్ : జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు నిర్మాణ వ్యయాన్ని రూ.5 లక్షలకు పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేశు కోరారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు మంజూరు చేసినప్పటికీ.. నిర్మాణ వ్యయం పెరుగుదల ప్రభావం వల్ల ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగక ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 17 నుంచి ఫిబ్రవరి 22వ తేది వరకు సంతకాల సేకరణ, విజ్ఞప్తులు, జిల్లా సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి, నాగసుబ్బారెడ్డి, ఆంజనేయులు, ఎంవీ సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, కేసీ బాదుల్లా, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్‌కు పితృ వియోగం



పులి ఓబయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్‌కుమార్ తండ్రి, రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పులి ఓబయ్య(76) కన్నుమూశారు. శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఆయన ఆకస్మాత్తుగా తుదిశ్వాస విడిచారు. ఓబయ్యకు కుమారుడు పులి సునీల్‌తోపాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు మాసీమ బాబు, అఫ్జల్‌ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి. డాక్టర్ సొహైల్‌లు ఓబయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సోమవారం ఉదయం 10.30 మాసాపేటలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరుగుతాయని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న అధికారులు

కడప స్పోర్ట్స్: యువత ఆరోగ్యంతోపాటు ఆత్మవిశ్వాసంతో ఉండటానికి క్రీడలు దోహదం చేస్తాయని సమగ్రశిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్టు అధికారి ఎ.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని యూత్‌హాస్టల్‌లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా చక్కటి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని సూచించారు. వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని రాణించాలని సూచించారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ కె.మణికంఠ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వెలికితీసేందుకు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

ఆటా–పాటా అదుర్స్

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో అదుర్స్ అనిపించారు. స్థానిక మిస్బా మూవీ ప్రతినిధుల ఆధ్వర్యంలో వర్షిణి డ్యాన్స్ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. పలు సినీ, జానపద గీతాలకు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

మాజీ ఎమ్మెల్సీ బాలకృష్ణమ్మకు ఘన నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ ఉద్యమ నేత, శాసనమండలి మాజీ సభ్యులు మార్పు బాలకృష్ణమ్మ 10వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కడపలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. నవోదయ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జతిన్ మాట్లాడుతూ దోపిడీ లేని వ్యవస్థ, శాస్త్రీయ విద్యావిధానం కోసం బాలకృష్ణమ్మ అహర్నిశలు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఐఫియా జాతీయ ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి అబ్దుల్లా, రాష్ట్ర అడిషనల్ కార్యదర్శి చెంగల్రాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు వీరాంజులరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని ఆందోళన



5కే రన్‌లో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సీపీఎస్ రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు పరచాలంటూ డిమాండ్ చేస్తూ ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో 5కే వాక్‌ను నిర్వహించారు. ఈ 5కే వాక్‌లో పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోతుల నాగరాజు పాల్గొని వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, పీఈటీఎస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్‌కిరణ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు రూతు ఆరోగ్యమేరి, రాష్ట్ర కౌన్సిలర్ సుజాతరాణి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఎస్ జిల్లా కన్వీనర్ సుదర్శన్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

పెండ్లిమర్రి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హజరవుతారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.